సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 27 । జూన్ । 2025



టన్ను చీనీ రూ.32 వేలు
అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.32 వేలు, కనిష్టంగా 15 వేల ప్రకారం ధర పలికాయి.



జిల్లాలో వరుస హత్యలు
జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు యువకులు దారుణ హత్యకు గురయ్యారు. భార్యపై అనుమానంతో ఒకరిని, ఘర్షణలో మరొకరిని చంపేశారు. 8లో

గరిష్టం/కనిష్టం
34.4°/23.6°

జిల్లా పరిధిలో గురువారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 16 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల్లో ఆరుగురికి చోటు

పుట్టపర్తి టౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అనుబంధ సంఘాల నియామకంలో జిల్లాకు చెందిన ఆరుగురికి అవకాశం కల్పిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర రైతు సంఘం విభాగం సెక్రటరీగా పీవీ భాస్కర్‌రెడ్డి (పుట్టపర్తి నియోజవర్గం) జాయింట్ సెక్రటరీలుగా ఎస్ రంగారెడ్డి, ఎం.వెంకటరెడ్డి (పుట్టపర్తి నియోజవర్గం), రాష్ట్ర ఐటీ విభాగం జనరల్ సెక్రటరీగా నల్లపరెడ్డి (రాప్తాడు), ఐటీ విభాగం సెక్రటరీలుగా రోహిత్‌రెడ్డి, (రాప్తాడు) సి.జయపాల్‌రెడ్డి (పుట్టపర్తి) లను నియమించారు.

కృషి విజ్ఞాన కేంద్రం స్థాపనకు చర్యలు



అప్పరాచెరువు సమీపంలో భూములను పరిశీలిస్తున్న దృశ్యం

బత్తలపల్లి: మండల పరిధిలోని అప్పరాచెరువు గ్రామం వద్ద కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) స్థాపనకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఈ ప్రాజెక్టు అమలులో భాగంగా డాక్టర్ వైఎస్సార్ తోటగతి వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిపుణుల కమిటీని ప్రభుత్వం నియమించింది. కమిటీలో డాక్టర్ సి.మధుమతి(అసోసియేట్ డైరెక్టర్, రాయలసీమ జోన్) అధ్యక్షత వహిస్తుండగా, సభ్యులుగా డాక్టర్ కె.సుబ్రమణ్యం, డాక్టర్ ఎం.శివప్రసాద్, డాక్టర్ ఎం.బాలకృష్ణ ఉన్నారు. గురువారం నిపుణుల బృందం అప్పరాచెరువు సమీపంలోని సర్వే నంబర్లు 96, 97, 63లో కలిపి కేటాయించిన 68 ఎకరాల భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మట్టి నమూనాలు సేకరించి శాస్త్రీయ పరీక్షల కోసం ల్యాబ్‌కి పంపారు.

భూసేకరణపై గ్రామ సభలు

ప్రశాంతి నిలయం: సోలార్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకై భూసేకరణపై గ్రామ సభలు నిర్వహించాలని కలెక్టర్ టి.ఎస్.చేతన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సోలార్ పవర్ ప్రాజెక్టులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూసేకరణ ప్రక్రియలో భాగంగా సంబంధిత గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, ప్రజల అభిప్రాయాలను పొందిన తర్వాత సమగ్ర నివేదికలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

సోషల్ మీడియా కార్యకర్త అరెస్ట్

మడకశిర: మండలంలోని గుండుమల గ్రామానికి చెందిన సోషల్ మీడియా కార్యకర్త దళిత మంజునాథ్‌ను గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని మడకశిర పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. పట్టణ టీడీపీ కార్యకర్త ఈశ్వరప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సీఐ నగేష్ తెలిపారు. మంజునాథ్‌ని మడకశిర కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా.. మంజునాథ్ అరెస్ట్‌ను వైఎస్సార్‌సీపీ మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, కుంచిటి వక్కలిగ వైఎస్సార్‌సీపీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రంగేగౌడ్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నాయకుడు అశ్వత్థనారాయణ, ఎస్సీ సెల్ కార్యదర్శి మంజునాథ్ తదితరులు తీవ్రంగా ఖండించారు.

పనస కాయల వాహనం బోల్తా



బోల్తా పడిన బొలెరో వాహనం

కనగానపల్లి: బెంగళూరు నుంచి అనంతపురానికి పనస కాయల లోడ్‌తో వెళుతున్న బొలెరో వాహనం కనగానపల్లి మండలం మామిళ్లపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై బోల్తా పడింది. గురువారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. మామిళ్ల పల్లి సమీపంలోని గ్లాస్ ఫ్యాక్టరీ వద్దకు చేరుకోగానే వాహనం ముందరి టైర్లు రెండూ ఒక్కసారిగా పేలాయి. దీంతో రోడ్డుకు అడ్డంగా వాహనం బోల్తాపడింది. పనస కాయలన్నీ రోడ్డుపై చెల్లాచెదురయ్యాయి. ఘటనతో రూ.30 వేల మేర నష్టం వాటిల్లినట్లు అనంతపురానికి చెందిన వ్యాపారి పోతులయ్య వాపోయాడు. కాగా, ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు.

పింఛన్‌దారులపై.. కూటమి కుట్ర



కూటమి ప్రభుత్వం నూతన పింఛన్ల హామీని అటకెక్కించింది. అధికారంలోకి రాగానే 50 ఏళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్లో అర్హత ఉన్న వారందరికీ వృద్ధాప్య పింఛన్ మంజూరు చేస్తామని కూటమి నేతలు ప్రగల్భాలు పలికారు. అయితే అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా హామీ అమలు దిశగా ఒక్క అడుగు కూడా పడలేదు. ఇదిలా ఉంటే.. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులంటూ ఉన్న పింఛన్లు తొలగిస్తున్నారు.



పింఛన్ తొలగించారని కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేస్తున్న రామగిరి మండల వాసులు (ఫైల్)

- ప్రతి నెలా విడతల వారీగా కోతలు
- వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులే లక్ష్యం
- ఏడాది వ్యవధిలో 10 వేల మంది అర్హులకు మొండిచెయ్యి
- 50 ఏళ్లకే పింఛన్ హామీ గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం

సాక్షి, పుట్టపర్తి: జిల్లా వ్యాప్తంగా దాదాపుగా రెండు లక్షల మంది నూతన పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. నిత్యం సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పింఛన్ల కోసం ప్రదక్షణలు చేస్తున్నా వారికి నిరాశే ఎదురవుతోంది. ఇంకా ఆప్షన్ రాలేదని అధికారులు, ఉద్యోగులు చెబుతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఏడాదిలో 10,672 పింఛన్ల కోత

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్త పింఛన్లు ఇవ్వకపోగా ఉన్నవాటికి మంగళం పాడుతోంది. అనర్హుల ఏరివేత పేరిట టీడీపీకి అనుకూలంగా ఓటు వేయని వారందరినీ లక్ష్యంగా చేసుకుంది. గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ పొందిన వారికి సైతం నోటీసులు పంపించి జాబితా నుంచి పేరు తొలగించి అనర్హులుగా గుర్తించినట్లు తేల్చింది. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులే లక్ష్యంగా సామాజిక పింఛన్ల తొలగింపు ప్రక్రియ చేపడుతున్నారు.



చిత్రంలో కనిపిస్తున్న దివ్యాంగుడి పేరు ఓబులేసు. రామగిరి మండలం మక్కినవారిపల్లి గ్రామం. గత ప్రభుత్వంలో పింఛన్ పొందేవాడు. అయితే తన ఇంటిపై వైఎస్సార్‌సీపీ జెండా కట్టారనే కారణంతో కూటమి ప్రభుత్వం రాగానే పింఛన్ రాకుండా అడ్డుకున్నారు. అనర్హుడిగా ప్రకటించి.. జాబితా నుంచి పేరు తొలగించారు. తనకు అన్ని అర్హతలు ఉన్నాయని.. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం అధికారులు కనికరించడం లేదని ఓబులేసు వాపోతున్నాడు.

జిల్లాలో పింఛన్ కానుక ఇలా..

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య
2019	2,44,998
2020	2,54,131
2021	2,60,731
2022	2,67,156
2023	2,74,839
2024	2,74,839
2025	2,64,077

మండలానికి ఓ టీడీపీ నేత జాబితా తయారు చేసి అధికారులకు అందజేస్తే.. వారందరికీ నోటీసులు పంపించి అర్హత నిరూపించుకోవాలని చెబుతున్నారు. దివ్యాంగులైతే మరోసారి వైద్యుల నుంచి సర్టిఫికెట్ తీసుకొని సమర్పించాలని అడుగుతున్నారు. గతేడాది జూన్ 12న చంద్రబాబు సీఎంగా బాధ్యతలు తీసుకునే సమయంలో జిల్లాలో 2,74,839 మంది పింఛన్‌దారులు ఉండగా.. 2025 జూన్ 1 నాటికి 2,64,077కు దిగొచ్చింది. సుమారు 10,672 మందిని పింఛన్ జాబితా నుంచి తొలగించారు.

కొత్త పింఛన్లు ఏవీ?

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏడాదిలో రెండు సార్లు కొత్త పింఛన్లు మంజూరు చేసేవారు. అర్హతే ప్రామాణికంగా ఏటా జనవరి, జూలై నెలల్లో ఎలాంటి సిఫారసు లేకుండా లబ్ధిదారుల ఎంపిక జరిగేది. గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే ఎక్కడికీ వెళ్లాల్సిన పని లేకుండా.. ఎవరినీ కలవాల్సిన అవసరం రాకుండా పింఛన్‌కు అర్హత సాధించేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లాలో ఒక్కటంటే ఒక్కటి కూడా కొత్త పింఛన్ మంజూరు చేయలేదు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు గ్రామ, వార్డు సచివాలయాలు, మండల కార్యాలయాల చుట్టూ ప్రదక్షణ చేస్తున్నారు.

ఆప్షన్ లేదని చెబుతున్నారు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే 50 ఏళ్లకే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పింఛన్ ఇస్తామని నాయకులు ప్రగల్భాలు పలికారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. సచివాలయానికి వెళ్లి అడిగితే.. ఆప్షన్ లేదని చెబుతున్నారు. నాకు 60 ఏళ్లు. బీసీ కులానికి చెందిన వ్యక్తిని. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ నాకు పింఛన్ ఇవ్వడం లేదు.
– కెంచప్ప, కదిరేపల్లి, మడకశిర మండలం

ఇచ్చిన మాట నిలుపుకోవాలి



నా వయసు 51 సంవత్సరాలు. చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. బీసీ కులానికి చెందిన నాకు గతేడాది నుంచి పింఛన్ రావాల్సి ఉంది. ఇప్పటికే నెలకు రూ.4 వేలు చొప్పున 12 నెలలకు రూ.48 వేలు ప్రభుత్వం బకాయి ఉంది. సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం 50 ఏళ్లు దాటిన మాలాంటి వాళ్లందరికీ వెంటనే పింఛన్ మంజూరు చేయాలని కోరుతున్నాం.
– బోయ పోతన్న, కోగిర, రొద్దం మండలం

కుట్రతోనే తొలగించారు



నాకు చాలా ఏళ్ల నుంచి వితంతు పింఛన్ వస్తోంది. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో కూడా పింఛన్ తీసుకున్నాను. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూమి ఎక్కువ చూపుతోందనే కారణంతో పింఛన్ జాబితా నుంచి నా పేరు తొలగించారు. టీడీపీకి ఓటు వేయలేదనే కారణంతోనే కుట్ర చేస్తున్నట్లు తెలుస్తోంది.
– రుక్మిణెమ్మ, వేపకుంట, కనగానపల్లి మండలం

‘ఉద్యాన’ పథకాలు వినియోగించుకోండి

- రెండు జిల్లాల డీడీలు ఉమాదేవి, చంద్రశేఖర్



అనంతపురం అగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలు, రాయితీలు, ప్రోత్సాహకాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని రెండు జిల్లాల ఉద్యానశాఖ డీడీలు డి.ఉమాదేవి, జి.చంద్రశేఖర్ తెలిపారు. కొత్త తోటల పెంపకంలో భాగంగా హెక్టారుకు మామిడి తోటలకు రెండు సంవత్సరాల్లో రూ.50 వేల నుంచి రూ.1.20 లక్షల వరకు రాయితీ వర్తిస్తుందని పేర్కొన్నారు. జామకు రూ.80 వేలు, చీనీ రూ.50 వేలు, దానిమ్మ రూ.50 వేలు, సీతాఫలం రూ.30 వేలు, సపోటా రూ.30 వేలు, రేగు రూ.30 వేలు, ద్రాక్ష రూ.1.20 లక్షలు, టిష్యూకల్చర్ అరటి రూ.70 వేలు, బొప్పాయి రూ.30 వేలు, డ్రాగన్ ఫ్రూట్ రూ.2.70 లక్షలు, అవకాడో రూ.50 వేలు, అంజూర రూ.50 వేలు, ప్యాషన్ ఫ్రూట్ రూ.2.75 లక్షలు, ఉసిరి రూ.75 వేలు, నేరేడు రూ.75 వేలు, చింత రూ.75 వేలు, ఫల్సాఫ్రూట్ రూ.75 వేలు, విడిపూల సాగుకు రూ.50 వేలు, హైబ్రీడ్ కూరగాయల సాగు రూ.60 వేల మేర రెండేళ్లలో రాయితీ వర్తిస్తుందని తెలిపారు. పుట్టగొడుగుల పెంపకానికి రూ.2 లక్షలు రాయితీ ఉంటుందన్నారు. ముదురుతోటల పెంపకంలో భాగంగా 10 సంవత్సరాల పైబడి వయసున్న మామిడి, 8 సంవత్సరాల పైబడి కలిగిన చీనీ తోటలకు హెక్టారుకు రూ.24 వేలు రాయితీ ఇస్తామన్నారు. వ్యక్తిగత ఫారంపాండ్ల నిర్మాణానికి రూ.75 వేలు, పాలీహౌస్‌ల నిర్మాణానికి రూ.1.25 లక్షలు, షేడ్‌నెట్ హౌస్‌లకు రూ.8.87 లక్షలు, మామిడి, అరటి ఫ్రూట్ కవర్స్‌కు రూ.25 వేలు, ప్లాస్టిక్ మల్చింగ్‌కు రూ.20 వేలు, ప్యాక్‌హౌస్‌లకు రూ.2 లక్షలు, మినిమల్ ప్రాసెసింగ్ యూనిట్‌కు రూ.12.85 లక్షలు, మినీట్రాక్టర్‌కు 1.96 లక్షలు, పవర్ టిల్లర్‌కు రూ.లక్ష, తైవాన్ స్ప్రేయర్‌కు రూ.10 వేలు, టమాటా ట్రెల్లీస్‌కు రూ.18,750, హైబ్రీడ్ కూరగాయల విత్తనాలకు రూ.3 వేలు, శాశ్వత పందిళ్లకు రూ.2.50 లక్షలు మేర రాయితీ వర్తిస్తుందని వివరించారు. అలాగే సోలార్‌కోల్డ్ రూంలు, సోలార్ క్రాప్ డయ్యర్లు, కోల్డ్‌స్టోరేజీల్లో కండెన్సర్ల మార్పు, రిఫర్‌వాన్, ప్లాస్టిక్ క్రేట్స్‌కు రాయితీలు, ప్రోత్సాహకాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన పండ్లతోటల రైతులు ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లు, హెచ్‌ఓలు, ఉద్యానశాఖ కార్యాలయాల్లో సంప్రదించాలన్నారు.

లుక్ పేరుతో బుక్ చేసేశారు!

- రూ.వందల కోట్లు డిపాజిట్ చేయించుకుని మోసం చేసిన వైనం
- రూ.2.50 లక్షలు చెల్లిస్తే రోజూ రూ.16 వేల ఆదాయం అంటూ గాలం
- అపరిమితంగా ఖాతాదారులను పెంచుకుని బురిడీ



అనంతపురం: రూ.2.50 లక్షలు చెల్లిస్తే రోజూ రూ.16 వేల ఆదాయం వస్తుందని నమ్మించారు. రూ.20,300 చెల్లిస్తే.. నిత్యం రూ.700 ఆదాయం వస్తుందని గాలం వేశారు. చివరికి రూ.కోట్లలో డిపాజిట్ చేయించుకుని బుక్ చేసేశారు. వివరాలు.. అమెరికన్ కంపెనీ ‘లుక్’ పేరుతో యాప్‌ను ప్రవేశపెట్టారు. పుస్తకాలు, గ్రంథాలు ఆన్‌లైన్‌లో చదివే ‘లుక్’ యాప్‌లో చందాదారుల పేరుతో దోపిడీ ప్రారంభించారు. రూ.2.50 లక్షలు చెల్లిస్తే రోజూ రూ.16 వేలు ఆదాయం వస్తుందని నమ్మించారు. ప్రతి బుధవారం నగదు డ్రా చేసుకునే వెసులుబాటు కల్పించారు. రూ.20,300 చెల్లిస్తే.. రోజూ రూ.700 ఆదాయం వస్తుంది. ప్రతి రోజూ యాప్‌లో 25 టాస్క్‌లు ఉంటాయి. వీటిపై క్లిక్ చేస్తే ఒక్కో టాస్క్‌కు రూ.28లు నగదు క్రెడిట్ అవుతుంది. ఇలా ప్రతి బుధవారం నగదు డ్రా చేసుకోవచ్చు. కొత్త ఖాతాదారులను చేర్పిస్తే 30 శాతం వెంటనే నగదు ఖాతాలోకి జమ అవుతుంది. ఇలా ప్రారంభంలో అత్యంత నమ్మకంగా, కచ్చితంగా మొత్తాలను చెల్లించారు. అనంతపురం నగరంలోనే రూ.20 వేల చందాదారులు వేలల్లో ఉన్నారు. రూ.2.50 లక్షల చందాదారులు వందల్లో ఉన్నారు. బుధవారం డ్రా చేసుకునేందుకు క్లిక్ చేయగా, తక్షణమే 30 శాతం చెల్లిస్తే.. ఈ 30 శాతం ఖాతాలో ఉన్న మొత్తం అంతా డ్రా చేసుకోవచ్చని యాప్‌లో మెసేజ్ చేశారు. దీంతో బుధవారం అర్ధరాత్రి 12 గంటల వరకు పోటీ పడి నగదు డిపాజిట్ చేశారు. అప్పులు చేసి మరీ డిపాజిట్ చేశారు. బుధవారం రాత్రి రూ.2.50 లక్షలు చెల్లించిన వారే అధికంగా ఉన్నారు. రూ.20 వేలు చెల్లించిన చందాదారులు తక్షణమే రూ.6,090 చెల్లించాలి. లేదంటే ఖాతా క్లోజ్ చేస్తామని హెచ్చరించారు. దీంతో ఉన్న ఫలంగా రూ.6,090 చెల్లించారు. ఇలా ఖాతాదారులకు అత్యాశ చూపించి బుధవారం రాత్రే అధికంగా మొత్తాలను కట్టించుకున్నారు. డబ్బు డ్రా చేయడంతో బ్యాంకు ప్రాసెస్‌లో ఉందంటూ గురువారం రాత్రి యాప్‌లో డేటాను తొలగించేశారు. దీంతో ఖాతాదారులు లబోదిబోమంటున్నారు. ‘లుక్’ పేరుతో కోట్లాది రూపాయలు దోచేశారని ఆందోళన చెందుతున్నారు. సైబర్ క్రైం హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫోన్లు చేస్తున్నారు.

అధికారులందరూ సమన్వయంతో పనిచేయండి



కొత్తచెరువులో జూనియర్ కళాశాల ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, అధికారులు

ప్రశాంతి నిలయం/పుట్టపర్తి టౌన్: ముఖ్యమంత్రి చంద్రబాబు జూలై 5వ తేదీన కొత్తచెరువులో పర్యటించే అవకాశం ఉందని, అధికారులు సమన్వయంతో సీఎం పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సూచించారు. గురువారం కొత్తచెరువులోని జెడ్పీ బాలుర, బాలికల పాఠశాలలు, సత్యసాయి ప్రభుత్వ జూనియర్ కాలేజీలను ఎస్పీ వి.రత్న ,జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌లతో కలసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కొత్తచెరువులో పర్యటించి విద్యార్థుల తల్లిదండ్రులతో ముఖాముఖి మాట్లాడతారన్నారు. సభా స్థలం, పార్కింగ్ స్థలాల్లో పక్కాగా ఏర్పాట్లు చేయాలన్నారు.

అమ్మలపై అలసత్వం

బాలింతలకు కరువైన ‘జేఎస్‌వై’ భాగ్యం

- ప్రభుత్వ నిర్లక్ష్యంతో చేకూరని లబ్ధి
- వేలమంది బాలింతలకు పైసా అందని వైనం
- ‘అనంతపురం’లో 56 శాతం, ‘శ్రీ సత్యసాయి’ 64 శాతం మందే దరఖాస్తు



శ్రీసత్యసాయి జిల్లాలో

హెచ్‌ఎంఐఎస్‌లో నమోదైన ప్రసవాలు	5,280
ఎంఎస్ఎస్ (మాతా శిశు సురక్షలో నమోదు)	4,085
లబ్ధి పొందిన బాలింతల సంఖ్య	3,427
లబ్ధిపొందిన బాలింతల శాతం	64.91

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ‘అమ్మా పెట్టదు అడుక్కూ తిననివ్వదు’ అన్న చందమిది. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వం జేఎస్‌వై (జననీ సురక్ష యోజన) ప్రవేశపెట్టింది. ఈ పథకం అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలో రాష్ట్రంలోనే అత్యంత ఘోరంగా అమలవుతున్నట్టు తేలింది. ఆస్పత్రిలో చేరిన గర్భిణి ప్రసవమై డిశ్చార్జ్ అయ్యేలోగా తల్లి వివరాలన్నీ యాప్‌లో నమోదు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలి. వివరాలన్నీ సరిగా పంపితే తల్లి ఖాతాలోకి రూ.1,500 వేస్తారు. కానీ అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో కనీసం 55 శాతం మందికి కూడా ఈ పథకం వర్తించడం లేదంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అంచనా వేయొచ్చు.

ప్రభుత్వ నిర్లక్ష్యమే శాపం..

అనంతపురంతో పాటు శ్రీ సత్యసాయి జిల్లాలోనూ ‘జేఎస్‌వై’ పనితీరు దారుణంగా ఉంది. ఉదాహరణకు చిత్తూరు జిల్లాలో 84 శాతం మంది తల్లులకు ‘జేఎస్‌వై’ కింద సొమ్ము అందగా, అనంతపురం జిల్లాలో కేవలం 56 శాతం మందికి మాత్రమే అందింది. శ్రీ సత్యసాయి జిల్లాలో 64 శాతం మందికి మాత్రమే వర్తించింది. ప్రసవం జరిగిన ఆస్పత్రిలో దరఖాస్తు చేయకపోవడం వల్లే వేలాదిమంది బాలింతలు ఇలా తమకు వచ్చే కొద్దపాటి సొమ్మునూ కోల్పోతున్నారు. ఆస్పత్రులకు గర్భిణి రాగానే వివరాలు సేకరించి ఎంఎస్ఎస్ (మాతా శిశు సురక్ష) వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. భర్త పేరు, ఆధార్, బ్యాంకు ఖాతా నంబర్లు అన్నీ పంపించాలి. కానీ ఈ వివరాలు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లోనూ అప్‌లోడ్ చేయడానికి సిబ్బంది లేరు. ఉన్నా చాలా చోట్ల వాళ్ల వివరాలు నమోదు చేయడం లేదు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే నమోదు లేకపోతే ఇక ప్రైవేటు ఆస్పత్రుల్లో అసలే కానరావడం లేదు. దీంతో వేలాది మంది బాలింతలకు లబ్ధి చేకూరడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా 2024–25 సంవత్సరంలో 3 లక్షల మంది బాలింతలకు అందలేదు. అంటే ఒక్కొక్కరికి రూ.1,500 చొప్పున రూ.45 కోట్లు కోల్పోయారు. అంతేకాదు ‘జేఎస్‌వై’ సరిగా నమోదు కాకపోవడంతో ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన కింద రూ.6 వేలు కూడా చాలామంది కోల్పోతున్నారు. ఆస్పత్రి యాజమాన్యాల నిర్లక్ష్యంతో కేంద్రమిచ్చే నిధులకు పేద బాలింతలు నోచుకోవడం లేదు.

అలా ముగించేశారు!

- ప్రభుత్వానికి పట్టని ఎంటీఎస్ టీచర్ల గోడు
- బలవంతంగా బదిలీల కౌన్సెలింగ్
- 1998 ఎంటీఎస్ టీచర్లకూ పూర్తయిన బదిలీలు
- దాదాపు సరిహద్దు మండలాలకు ఎక్కువగా కేటాయింపు



1998 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: ఎంటీఎస్ టీచర్ల విషయంలో ప్రభుత్వం ఏమాత్రం తగ్గలేదు. ‘తాను పట్టిన కుందేలుకు మూడేకాళ్లు’ అన్న చందంగా మొండివైఖరితో ముందుకెళ్లింది. ఫలితంగా తక్కువ వేతనంతో పని చేస్తున్న వీరందరూ జిల్లా సరిహద్దు మండలాలకు వెళ్లాల్సి వచ్చింది. మొత్తం మీద వారిగోడును ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా అలా ముగించేశారు. తొలిరోజు 2008 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్లకు కౌన్సెలింగ్ పూర్తికాగా, రెండోరోజు గురువారం 1998 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్లకు పూర్తి చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక సైన్స్ సెంటర్‌లో కౌన్సెలింగ్ ఉంటుందంటూ ఉదయం అందరికీ మెసేజ్‌లు పెట్టారు. కౌన్సెలింగ్ ప్రారంభానికి ముందు ఖాళీల అంశంపై మాట్లాడే ప్రయత్నం చేసినా...డీఈఓ ప్రసాద్‌బాబు అంగీకరించలేదు. తన పరిధిలో లేని అంశం అని... కమిషనర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నామని తేల్చి చెప్పారు. ఇప్పటికీ ఎవరైనా కౌన్సెలింగ్‌కు అటెండ్ కామని చెబితే మాత్రం అలాంటి వారికి నేరుగా కమిషనర్ కార్యాలయం నుంచే స్కూళ్లు అలాట్ చేస్తారని, అవి ఎక్కడొస్తాయో కూడా తెలీదంటూ స్పష్టం చేశారు. ఇప్పటికే రెండుమార్లు కౌన్సెలింగ్‌ను బాయ్‌కాట్ చేసినా ప్రభుత్వం కరుణించలేదని ఎంటీఎస్ టీచర్లు వాపోయారు. తక్కువ వేతనంతో పని చేస్తున్న తమపై ఇంత కక్షసాధింపుగా వ్యవహరించడం సరికాదని వాపోయారు. ఎట్టకేలకు అందరూ అంగీకరించడంతో మధ్యాహ్నం 3.30 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభమైంది. అర్ధరాత్రి దాకా కొనసాగింది. 404 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ముందురోజు 190 మందికి 2008 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్లకు కౌన్సెలింగ్ పూర్తి చేశారు. నిబంధనల మేరకే ఉన్న ఖాళీలను చూపించామని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. ఏదిఏమైనా కౌన్సెలింగ్‌కు సహకరించి ప్రశాంతంగా జరిగేలా చేసిన ఎంటీఎస్ టీచర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

జిల్లాలో వరుస హత్యలు

- భార్యపై అనుమానంతో లేపాక్షి మండలంలో ఓ యువకుడి హత్య
- మంగళవారం రాత్రి వేటకొడవళ్లతో నరికి హతమార్చిన వైనం
- పోలీసుల అదుపులో నిందితులు
- జిల్లా సరిహద్దున కర్ణాటక పరిధిలో గురువారం తూముకుంట వాసి హత్య

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు యువకులు దారుణ హత్యకు గురయ్యారు. భార్యపై అనుమానంతో ఓ యువకుడిని మరొకరితో కలిసి రెండు రోజుల క్రితం భర్త మట్టుబెట్టగా గురువారం వెలుగు చూసింది. మరో ఘటనలో జిల్లా సరిహద్దున కర్ణాటక ప్రాంతంలో మద్యం మత్తులో చోటు చేసుకున్న గొడవలో హిందూపురం మండలానికి చెందిన ఓ వ్యక్తి హతమయ్యాడు.


రవికుమార్ (ఫైల్)

లేపాక్షి: భార్యపై అనుమానంతో ఓ యువకుడిని వేటకొడవళ్లతో నరికి హత్య చేసిన ఘటన గురువారం లేపాక్షి మండలంలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన మేరకు... లేపాక్షి మండలం మైదుగోళం గ్రామానికి చెందిన రవికుమార్ (37)కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తండ్రి అశ్వత్థప్పతో కలసి వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో తన ఇంటికి సమీపంలో నివాసముంటున్న బంధువు ఆనంద్ కుటుంబంతో రవికుమార్ చనువుగా ఉండేవాడు. తరచూ ఇంటికి రాకపోకలు సాగిస్తుండడంతో తన భార్య ప్రవర్తనపై అనుమానాలు పెంచుకున్న ఆనంద్ ఎలాగైనా రవికుమార్‌ను హత్య చేయాలని భావించాడు. ఈ క్రమంతో తన సోదరుడు గోవిందప్పతో కలసి పథకం రచించాడు. ఇందులో భాగంగానే మంగళవారం రాత్రి స్థానిక రైతు లింగప్ప తోటలో మందు పార్టీ



ఏర్పాటు చేసినట్లు తెలిపి రవికుమార్‌ను రప్పించుకున్నారు. ముగ్గురూ కలసి మద్యం సేవించారు. అదే సమయంలో మత్తులో జోగుతున్న రవికుమార్‌పై వేటకొడవలితో దాడి చేయడంతో మొండెం నుంచి తల వేరుపడింది. అనంతరం మృతదేహాన్ని నీటి గుంతలో గొయ్యి తీసి పాతిపెట్టారు. బుధవారం తెల్లవారినా కుమారుడు ఇంటికి రాకపోవడంతో అశ్వత్థప్ప ఆరా తీయడం మొదలు పెట్టాడు. ఈ క్రమంలో ఆనంద్, గోవిందప్ప ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో ఫిర్యాదు చేయడంతో ఇద్దరినీ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. దీంతో అసలు విషయం బయటపడడంతో నీటి గుంతలో పాతిపెట్టిన మృతదేహాన్ని గురువారం వెలికి తీసి, పోస్టుమార్టం నిమిత్తం హిందూపురంలోని జిల్లాస్పత్రికి తరలించారు. ఘటనపై మరింత లోతైన విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు.

మద్యం మత్తులో...

హిందూపురం/గౌరిబిదనూరు: మండల పరిధిలోని తూముకుంట చెక్‌పోస్టు ప్రాంతంలో నివాసముటున్న రవికుమార్ (37) జిల్లా సరిహద్దున కర్ణాటక పరిధిలో దారుణ హత్యకు గురయ్యాడు. వెల్డర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్న అతనికి భార్య అనుపమ, ఇద్దరు కుమారులు ఉన్నారు. మద్యానికి బానిస కావడంతో అతనిలో మార్పు తీసుకువచ్చేందుకు భార్య విశ్వ ప్రయత్నాలు చేసింది. అయినా మార్పు రాకపోవడంతో 4 ఏళ్ల క్రితం భర్తను వదిలేసి పిల్లలను పిలుచుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆమె రాలేదు. దీంతో ఒంటరిగా మారిన రవికుమార్ ఎప్పుడూ మద్యం మత్తులో జోగుతూ జులాయిగా తిరగసాగాడు. ఈ నేపథ్యంలో జిల్లా సరిహద్దున కర్ణాటక పరిధిలోని గంగోత్రి బార్ వద్దకు గురువారం వెళ్లిన అతను సాయంత్రం మద్యం మత్తులో జోగసాగాడు. అదే సమయంలో అక్కడకు చేరుకున్న హిందూపురంలోని బాపూజీనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ అశోక్‌తో గొడవపడ్డాడు. ఆ సమయంలో ఇద్దరూ పరస్పరం కొట్టుకున్నారు. గొడవ తారస్థాయికి చేరుకోవడంతో ఆటో డ్రైవర్ బీరు బాటిల్ ముక్క తీసుకుని విచక్షణారహితంగా దాడి చేశాడు. వరుస పోట్లకు గురి కావడంతో రవికుమార్ అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. సమాచారం అందుకున్న కర్ణాటకలోని గౌరిబిదనూర్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. సీసీ ఫుటేజీలను సేకరించారు. ఘటనపై గౌరిబిదనూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.


హతుడు రవికుమార్

క్లుప్తంగా

అండగా ఉంటాం.. అధైర్యపడొద్దు


సీఐ పవన్‌కుమార్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: మృతి చెందిన పోలీసు ఉద్యోగుల కుటుంబాలకు శాఖ తరుపున అండగా ఉంటామని ఎస్పీ రత్న భరోసానిచ్చారు. జిల్లా అటాచ్‌మెంట్‌తో పనిచేస్తున్న అనంతపురం డీటీసీ సీఐ పవన్‌కుమార్ అనారోగ్యంతో బాధపడుతూ గురువారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎస్పీ రత్న... అనంతపురంలోని మృతుడి స్వగృహానికి చేరుకుని పవన్‌కుమార్ మృతదేహానికి నివాళులర్పించారు. తక్షణ సాయం కింద రూ.75 వేలను కుటుంబ సభ్యులకు అందజేసి, పరామర్శించారు. అధైర్య పడరాదని, అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన సౌలభ్యాలను త్వరలో అందేలా చొరవ తీసుకుంటామని పేర్కొన్నారు. కాగా, 1998లో ఎస్‌ఐగా పోలీస్ శాఖలో చేరిన పవనర్‌కుమార్... శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోని రొద్దం, సోమందేపల్లి, మండలాల్లో పనిచేశారు. అనంతరం పదోన్నతిపై సీఐగా పుట్టపర్తి అటాచ్‌మెంట్‌తో అనంతపురం డీటీసీలో పనిచేస్తున్నారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మత్తుకు బానిస కావొద్దు

- మంత్రి సవిత


ర్యాలీలో పాల్గొన్న మంత్రి సవిత

పెనుకొండ: మత్తుకు బానిసలు కాకూడదని యువతకు మంత్రి సవిత పిలుపునిచ్చారు. ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా గురువారం పెనుకొండలో మంత్రి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారిన చాలా మంది యువకులు జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. సమాజానికి చెడు చేయాలని చూసే ఏ వ్యక్తినీ ఉపేక్షించబోమన్నారు. అనంతరం మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డీఎస్పీ నర్సింగప్ప, మున్సిపల్ కమిషనర్ సతీష్‌కుమార్, ఎక్సైజ్ సీఐ సృజన్‌బాబు, పెద్ద సంఖ్యలో మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి


పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తనకల్లు: సంగం డెయిరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పాడి రైతులకు డెయిరీ కార్య నిర్వాహణాధికారి పర్వతనేని అనిల్‌కుమార్ సూచించారు. మండలంలోని పరాకువాండ్లపల్లిలో గురువారం పాడి రైతులకు పశు పోషణ, పాల ఉత్పత్తిపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులకు సబ్సిడీపై పశుదాణా, మినరల్ మిక్చర్ పశుగ్రాస విత్తనాలను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, జోనల్ మేనేజర్ రావి బాలాజీ, ఆనంద్, మేనేజర్ పూజారి నాగరాజు, సిబ్బంది శ్రీధర్‌రెడ్డి, బాదుల్లా, శివయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న


మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్: జిల్లాను మాదక ద్రవ్య రహితంగా తీర్చిదిద్దాలని యువతకు కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా దినం సందర్భంగా పుట్టపర్తిలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి గణేష్ కూడలి వరకూ గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతం మాదక ద్రవ్యాల నివారణపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. డ్రగ్స్ మహమ్మారిపై విద్యార్థుల్లో చైతన్యం తీసుకువచ్చేలా పెద్ద ఎత్తున అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే కుటుంబాలు విచ్ఛిన్నమవుతాయని హెచ్చరించారు. డ్రగ్స్ బారిన పడి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. ఎస్పీ రత్న మాట్లాడుతూ.. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, పెడదారిన పడి జీవితాలు నాశనం చేసుకోకూడదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సింధూర రెడ్డి, ఆర్డీఓ సువర్ణ, ఎక్సైజ్ శాఖ అధికారి నాగముద్దయ్య, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, పోలీస్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏడీఏల బదిలీ జాబితా విడుదల


- అనంతపురం, హిందూపురం పెండింగ్

అనంతపురం అగ్రికల్చర్: బదిలీల ప్రక్రియలో భాగంగా వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీఏ)ల జాబితా ఎట్టకేలకు వెల్లడైంది. బదిలీల చివరి రోజైన ఈనెల 9న రాష్ట్ర వ్యాప్తంగా 133 మందితో జాబితా విడుదల చేశారు. అయితే వెనువెంటనే జాబితాను వెనక్కి తీసుకున్నారు. 17 రోజుల తర్వాత తాజాగా బుధవారం అర్ధరాత్రి రెండో సారి 110 మందితో జాబితా విడుదల చేశారు. అయితే, రాష్ట్ర వ్యాప్తంగా 23 మంది పరిస్థితి తేలలేదు. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి లేకపోవడం గమనార్హం. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా బదిలీల ప్రక్రియ చేపట్టడంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. పలుకుబడి, ప్రజాప్రతినిధుల సిఫారసులు, పెద్ద మొత్తంలో డబ్బు చేతులు మారినట్లు విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొదటి జాబితాలో 9 మంది ఏడీఏలను బదిలీ చేస్తూ జాబితా ఇచ్చారు. తాజాగా విడుదలైన జాబితాలో ఏడుగురు ఏడీఏలను బదిలీ చేశారు. అత్యంత కీలకమైన అనంతపురం డివిజన్‌తో పాటు హిందూపురం డివిజన్‌లకు ఏడీఏలను కేటాయించకపోవడం గమనార్హం.

బదిలీలు ఇలా...

ఎస్.సత్యనారాయణ కదిరి నుంచి ఉరవకొండకు, ఎం.చెంకలరాయుడు తాడిపత్రి నుంచి కర్నూలు జిల్లా ఆలూరు, బి.క్రిష్ణమీనన్ మడకశిర నుంచి పెనుకొండ, జే.సనావుల్లా పుట్టపర్తి డీఆర్‌సీ నుంచి కదిరి, ఎల్.లక్ష్మానాయక్ రాయదుర్గం నుంచి ధర్మవరం, ఎస్.పద్మజ ఉరవకొండ నుంచి రాయదుర్గం, ఎం.రవి అనంతపురం నుంచి తాడిపత్రి బదిలీ అయ్యారు. అనంతపురం నుంచి రవి బదిలీ కాగా ఆ స్థానంలో ఎవరినీ నియమించలేదు. హిందూపురంలో ఉన్న అల్తాఫ్ అలీఖాన్‌ను ఎక్కడకు బదిలీ అయ్యారనే విషయం అనేది కూడా తేలలేదు. ధర్మవరం ఏడీఏ క్రిష్ణయ్యను కూడా ఎక్కడకు బదిలీ చేశారనేది తేలాల్సివుంది. అనంతపురం ఏడీఏ స్థానానికి అల్తాఫ్ అలీఖాన్, క్రిష్ణయ్యల మధ్య పోటీ ఉన్నట్లు తెలుస్తోంది.

ఇదెక్కడి టోల్ బాదుడు?!




రెండు నిమిషాల వ్యవధిలో రెండేసి మార్లు డెబిట్ అయిన నగదు

చిలమత్తూరు: టోల్ ప్లాజాల వద్ద ఒకే ఎంట్రీకి రెండేసి సార్లు బిల్లులు డెబిట్ అవుతుండడంతో పలువురు వాహనదారులు మండిపడుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం అంది పుచ్చుకున్న ప్రస్తుత రోజుల్లో టోల్‌ప్లాజాల వద్ద వాహనాల ఎంట్రీని సులభ తరం చేసేందుకు ఫాస్టాగ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. వాహనాలు టోల్ గేట్‌లోకి ప్రవేశించగానే ఫాస్టాగ్ స్కాన్ అయి దాని ద్వారా ఎంట్రీకి సంబంధించిన రుసుం సదరు వాహనదారుడి బ్యాంక్ ఖాతా నుంచి డెబిట్ అవుతుంది. ఈ క్రమంలో గురువారం హిందూపురానికి చెందిన అయూబ్ తన వాహనంలో వెళుతూ చోళసముద్రం టోల్‌ప్లాజా దాటారు. రెండు నిముషాల వ్యవధిలో రెండు సార్లు అతని బ్యాంక్ ఖాతా నుంచి టోల్‌ప్లాజా రుసుం డెబిట్ కావడంతో కంగుతిన్న అయూబ్ వెంటనే టోల్‌ప్లాజా సిబ్బందిని ప్రశ్నించారు. పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో జరిగిన మోసాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ నెల 19న బాగేపల్లి టోల్‌ప్లాజా వద్ద కూడా ఇలాగే తన బ్యాంక్ ఖాతా నుంచి రెండు సార్లు నగదు డెబిట్ అయిందని వివరించారు. జరిగిన మోసంపై తాను సోషల్ మీడియా వేదికగా వాహనదారులను చైతన్య పరుస్తూ పోస్టు చేసినట్లు వివరించారు. టోల్‌ప్లాజా యాజమాన్యం దోపిడీపై ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.

రైళ్లల్లో కొరవడిన భద్రత

- రెచ్చిపోతున్న దోపిడీ దొంగలు
- ప్రయాణికుల సొమ్ముకు రక్షణ కరువు
- నిద్రావస్థలో రైల్వే పోలీసులు


సిగ్నల్ ఇవ్వకపోవడంతో గుంతకల్లు జంక్షన్ ఔటర్‌లో నిలిచిన కాచిగూడ-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు

గుంతకల్లు: రైలు ప్రయాణమంటనే ప్రయాణికులు హడలెత్తిపోయే రోజులు వచ్చాయి. ముఖ్యంగా దుండగులు అర్ధరాత్రి సమయాల్లో సిగ్నల్ కోసం వేచి చూస్తూ రైల్వేస్టేషన్ ఔటర్ ప్రాంతాల్లో నిలిపిన రైళ్లను లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు తెరలేపడమే ఇందుకు కారణం. ఇంత జరుగుతున్న రైల్వే ఎస్కార్ట్, నిఘా వ్యవస్థలు నిద్రావస్థలో ఉండిపోయాయి. రైళ్లల్లో గస్తీ నిర్వహించే పోలీసులు ఏసీ బోగీల్లో నిద్రపోతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

ఇటీవల జరిగిన రైళ్లలో జరిగిన చోరీలు..

- ఈ ఏడాది ఏప్రిల్ 29న నిజాముద్దీన్-తిరుపతి మధ్య నడిచే రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలు గుత్తి జంక్షన్ సమీపంలో ఔటర్‌లో సిగ్నల్ ఇవ్వకపోవడంతో నిలిచిపోయింది. ఇదే అదనుగా భావించిన దుండగులు ముందస్తు పథకం ప్రకారం దాదాపు నాలుగు స్లీపర్ బోగీల్లోకి చొరబడి మారణాయుధలతో ప్రయాణికులను భయభ్రాంతులకు గురి చేస్తూ 10 తులాలకు పైగా బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులను అపహరించారు.
- మూడేళ్ల కిత్రం వరురసగా హంపి, రాయలసీమ, చైన్నై ఎక్స్‌ప్రెస్ రైళ్ల అదే ఔటర్‌లో సిగ్నల్ కోసం నిలిపిన సమయంలో దుండగులు చొరబడి దాదాపు 30 తులాలకు పైగా విలువైన బంగారు ఆభరణాలను అపహరించారు.
- గుత్తి-అనంతపురం రైలు మార్గంలోని తురకపల్లి రైల్వేస్టేషన్, గుత్తి-తాడిపత్రి రైలు మార్గంలోని జక్కలచెరువు రైల్వేస్టేషన్ సమీపంలో సిగ్నల్ వైర్లను కట్ చేయడంతో రైలు ముందుకు పోవడానికి అవకాశం లేకుండా చేసి, ప్రయాణికుల నుంచి బంగారు ఆభరణలు ఎత్తుకెళ్లారు.
- తాజాగా (గడిచిన సోమవారం వేకువజాము) తాడిపత్రి రైల్వేస్టేషన్ ఔటర్‌లో సిగ్నల్ వైర్లను కట్ చేసి కోమలి రైల్వేస్టేషన్ ఔటర్‌లో నిలిచిన ముంబై-చైన్నై ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణికురాలు విశాలక్ష్మి మెడలోని 2.7 తులాల బంగారు గొలుసును లాక్కొని ఉడాయించారు.

అదే రోజు రాత్రి పాండిచ్చేరి-కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణికురాలు దివ్యభారతి మెడలోని 3.5 తులాల బంగారు చైన్‌ను లాక్కొని ఉడాయించారు. గుత్తి రైల్వేస్టేషన్‌లో ఆగిన రైలు కిటికి వద్ద కూర్చొన్న ఓ ప్రయాణికుడి చేతిలోని ఖరీదైన సెల్‌ఫోన్‌ను అపహరించారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధి 12 జిల్లాలకు విస్తరించి ఉంది. ఇందులో అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు. కడప, నంద్యాల, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీలతోపాటు కర్ణాటకలోని రాయచూర్, బళ్లారి జిల్లాలకూ గుంతకల్లు రైల్వే పోలీస్ కేంద్రంగా ఉంది. గుంతకల్లు డివిజన్ వ్యాప్తంగా 900 మంది పోలీసులు అవసరం కాగా, ప్రసుత్తం 550 మంది మాత్రమే ఉన్నారు. 350కి పైగా ఖాళీలు ఉన్నాయి. డివిజన్ వ్యాప్తంగా రోజూ 300కు పైగా ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లలో 5 లక్షల మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే గుంతకల్లు, గుత్తి రైల్వేజంక్షన్ల మీదుగా రాత్రి పూట దాదాపు 50కి పైగా ఎక్స్‌ప్రెస్ రైళ్లు తిరుగాడుతున్నాయి. ఈ రైళ్లకు 20 నుంచి 24 బోగీలు ఉంటాయి. రాత్రి పూట తిరిగే ఎక్స్‌ప్రెస్ రైళ్లలో కేవలం ఇద్దరు కానిస్టేబుళ్లను మాత్రమే ఎస్కార్ట్‌గా కేటాయిస్తున్నారు. స్టాఫ్ తక్కువగా ఉండటంతో ఉన్న సిబ్బందితోనే 24 గంటలు విధులు నిర్వహిస్తుండటంతో విశ్రాంతి లేక జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్‌లు ఒత్తిడికి లోనువుతున్నారు.

ప్రయాణికుల రక్షణే ధ్యేయం

ప్రయాణికుల రక్షణే ధ్యేయంగా ఉన్న కొద్ది పాటి సిబ్బందితో ర్యాండమ్‌గా రైళ్లలో బందోబస్తు చేపడుతున్నాం. జీఆర్‌పీ సిబ్బంది ఇద్దరితో పాటు ఆర్‌పీఎఫ్‌కు చెందిన మరో కానిస్టేబుల్‌కు రైళ్లలో ఎస్కార్టు విధులు కేటాయిస్తున్నాం. సమస్యాత్మక రైలు మార్గాలపై ప్రత్యేక నిఘా ఉంచుతాం. అనుమానాస్పద వ్యక్తుల వేలిముద్రలు సేకరిస్తున్నాం.

– హర్షిత, జీఆర్పీ ఇన్‌చార్జ్ డీఎస్పీ, గుంతకల్లు

వేధింపులపై కేసు నమోదు

హిందూపురం: అదనపు కట్నం కోసం తన భర్త జిల్లాన్ వేధిస్తున్నాడంటూ హిందూపురంలోని మేళాపురంలో నివాసముంటున్న తస్మీన్ గురువారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ధర్మపురం ప్రాంతానికి చెందిన తస్మీన్‌కు రెండేళ్ల క్రితం మేళాపురంలోని జిలాన్‌తో వివాహమైంది. పెళ్లి సమయంలో కుటుంబసభ్యులు పెద్ద మొత్తంలో కట్నకానుకలు ఇచ్చారు. ఈ క్రమంలో కొన్ని నెలలు వీరి కాపురం సజావుగా సాగింది. ఇటీవల అదనపు కట్నం కోసం వేధింపులు తారస్థాయికి చేరుకోవడంతో భరించలేక బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత..

మేళాపురంలోని దీప్తి స్కూల్‌లో చదువుతూ, అక్కడే హాస్టల్‌లో ఉంటున్న 5వ తరగతి విద్యార్థి గురువారం సాయంత్రం హాస్టల్ నుంచి బయటకు వెళ్లిపోయాడు. విషయాన్ని గుర్తించిన స్కూల్ నిర్వాహకులు వెంటనే పరిగి మండలం ధనాపురంలో ఉంటున్న తల్లికి సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో గాలింపు చేపట్టిన పోలీసులు పాత బస్టాండ్ సమీపంలో తచ్చాడుతున్న బాలుడిని గుర్తించి తల్లికి అప్పగించారు.

గంజాయి సాగు, రవాణాకు పాల్పడితే జిల్లా బహిష్కరణ


డాక్టర్ షిమోషి, అనంతపురం రేంజ్ డీఐజీ

అనంతపురం: గంజాయి సాగు, వినియోగం, అక్రమ రవాణాకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షిమోషి హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాల సాగు, వినియోగం, అక్రమ రవాణా వంటి కార్యకలాపాలకు పాల్పడిన వారిని జిల్లా నుంచి బహిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మత్తు పదార్థాల నియంత్రణలో ఎట్టి పరిస్థితుల్లో రాజీపడబోమని స్పష్టం చేశారు. మత్తుపదార్థాల వినియోగంతో వ్యక్తి శారీరక, మానసిక ఆరోగ్యానికి తీవ్ర నష్టం కలుగుతుందని, వినియోగదారులు విచక్షణ కోల్పోయి నేర ప్రవృత్తిని అలవర్చుకుంటారని అన్నారు. గంజాయి పొగ రూపంలో తీసుకుంటే ఊపిరితిత్తుల సమస్యలు, దీర్ఘకాలంలో ప్రాణాప్రాయం తలెత్తుతుందన్నారు. గంజాయి, డ్రగ్స్ వాడకం వల్ల కుటుంబాల అభివృద్ధి దెబ్బతింటుందన్నారు. డ్రగ్స్ రవాణాకు పాల్పడిన వారిపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, చర్యలు తీసుకుంటామన్నారు. డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఇరువర్గాల పరస్పర దాడులు

కదిరి అర్బన్: మండలంలోని మరువతండా గ్రామంలో బంధువుల మధ్య గొడవ చోటుచేసుకుని పరస్పరం దాడులు చేసుకున్నారు. గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. క్షతగాత్రులు చికిత్స నిమిత్తం కదిరి ఏరియా ఆస్పత్రికి చేరుకున్నారు. వివరాలు.. కదిరి మండలానికి చెందిన శ్రీవాణి, రవీంద్రనాయక్ దంపతులు బతుకు తెరువు కోసం కొన్ని నెలల క్రితం కేరళకు వలస వెళ్లి ఇటీవల వచ్చారు. ఈ క్రమంలో వారితో పాటు వారి మూడేళ్ల వయసున్న కుమార్తె కనిపించకపోవడంతో బంధువు రామచంద్రనాయక్ గురువారం నిలదీశాడు. పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో కుమార్తెను కేరళలో విక్రయించి వచ్చారంటూ రామచంద్రనాయక్ మండిపడ్డాడు. దీంతో ఇరు కుటుంబాల మధ్య గొడవ చోటు చేసుకుని పరస్పరం కొట్టుకున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, రామచంద్రనాయక్ ఆరోపించినట్లుగా బిడ్డను విక్రయించిన అంశంపై సమగ్ర విచారణ చేపడతామని కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పీఎస్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

డీపీటీఓకు ప్రశంసాపత్రం


డీపీటీఓకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

పుట్టపర్తి టౌన్: గత ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాలోని ఆర్టీసీ ఖాళీ స్థలాలను లీజ్‌కు ఇచ్చి సంస్థకు అధిక ఆదాయం సమకూర్చిన జిల్లా ప్రజా రవాణాధికారి మధుసూదన్‌ను అభినందిస్తూ గురువారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ప్రశంసాపత్రాన్ని అందుకున్న డీపీటీఓను ఆర్టీసీ ఉద్యోగులు అభినందించారు.

ఎక్సైజ్ స్టేషన్ తనిఖీ


సిబ్బందితో మాట్లాడుతున్న ఎక్సైజ్ డీసీ నాగముద్దయ్య

ధర్మవరం అర్బన్: స్థానిక ప్రొహిబిషన్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను గురువారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య, పుట్టపర్తి అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరసింహులు తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. గ్రామాల్లో నాటుసారా తయారీ చేయకుండా తరచూ తనిఖీలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ధర్మవరం ఎక్సైజ్ సీఐ చంద్రమణి, ఎస్‌ఐలు చాంద్ బాషా, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గుంతకల్లు టౌన్: స్థానిక రైల్వేస్టేషన్ పార్సిల్ కార్యాలయం ఎదురుగా ఉన్న పార్క్‌లో ఓ వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం సాయంత్రం అటుగా వెళ్లిన ప్రయాణికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు చేరుకుని పరిశీలించారు. చొక్కా జేబులో లభ్యమైన ఆధార్ కార్డు ఆధారంగా మృతుడు కర్ణాటకలోని రాయచూర్ జిల్లా గుడెదనాల్‌కు చెందిన శరణప్ప(39)గా గుర్తించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.